సాక్షి గుంటూరు

గురువారం | 5 | జూన్ | 2025



మొక్కలు నాటే కార్యక్రమం

చిలకలూరిపేట: ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలోని సాయిబాబా గుడి వద్ద బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.



రోడ్లపై వ్యర్థాలుంటే చర్యలు

తెనాలి అర్బన్: రోడ్లపై వ్యర్థాలు కనిపిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. గంగానమ్మపేటలో బుధవారం ఆయన పర్యటించి, సిబ్బందికి సూచనలిచ్చారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



నకరికల్లు: నర్సింగపాడు శ్రీ గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు బుధవారం ముగిశాయి. అర్చకుడు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

సివిల్స్ ర్యాంకర్‌కు తెలంగాణ గవర్నర్ సత్కారం



తెనాలి: గత నెలలో వెలువడిన సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ర్యాంకు సాధించిన తెనాలికి చెందిన దోనేపూడి విజయ్‌బాబును బుధవారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సత్కరించారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్–2024 పరీక్షల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ర్యాంకర్లను తెలంగాణ రాజ్‌భవన్ దర్బార్ హాలులో ఆ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సత్కరించారు. అందులో భాగంగా విజయ్‌బాబు సత్కారం అందుకున్నారు. ఆయన గతంలోనే సివిల్స్‌లో ర్యాంక్ సాధించి, ఐఆర్‌ఎస్ అధికారిగా సేవలను అందిస్తున్నారు. మెరుగైన ర్యాంకు కోసం మళ్లీ 2024 పరీక్షలు రాశారు. ఆ పరీక్షలోని ర్యాంకర్లకు ఇంకా పోస్టింగులు ఇవ్వాల్సివుంది. ఐపీఎస్ వస్తుందని విజయ్‌బాబు, ఆయన తల్లిదండ్రులు ఆశిస్తున్నారు.

రేపు ఐటీఐ ప్రవేశాలకు కౌన్సెలింగ్

తెనాలి అర్బన్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో ప్రవేశాల కోసం శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి వెంకటేశ్వర్లు ఒక ప్రకటలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మెరిట్ నెంబర్ 1 – 150, మధ్యాహ్నం 2 గంటలకు 151 – 298 వరకున్న వారికి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని పేర్కొన్నారు. మెరిట్ నెంబర్ తెలుసుకునేందుకు ఫోను నెంబర్ 93477 95893, 63045 72793లలో సంప్రదించాలని సూచించారు.

యోగాతో సామర్థ్యం మెరుగు



నగరంపాలెం: యోగా, ధ్యానం అభ్యాసం వల్ల మనిషి ఆలోచనా విధానం, సామర్థ్యం మెరుగుపడతాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. నాషా ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా బుధవారం పోలీస్ పరేడ్ మైదానంలో యోగా అభ్యాసం నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ యోగా, ధ్యానం అనేవి శారీరకంగా, మానసికంగా మనిషి స్థితిగతులను మార్చగలిగే అంశాలు అన్నారు. మానసిక స్థిరత్వం, ప్రశాంతత అలవడతాయని చెప్పారు. ఒత్తిళ్లను అధిగమించే శక్తి పెంపొందుతుందని పేర్కొన్నారు. క్రమశిక్షణ అలవాటై, దురలవాట్లకు దూరంగా ఉంటారని అన్నారు. జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలురెడ్డి, ఆర్ఐ శ్రీహరిరెడ్డి, పోలీస్ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జీడీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి బాధ్యతల స్వీకరణ

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (జీడీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జిగా వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు గురువారం ఉదయం 11 గంటలకు బ్రాడీపేటలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు జీడీసీసీబీ ఇన్‌చార్జి సీఈఓ ఫణికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా వడ్రాణం హరిబాబు గురువారం ఉదయం 8.45 గంటలకు కన్నావారితోటలోని జీడీసీఎంఎస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు జీడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం(గుంటూరు ఈస్ట్) : గుంటూరు కృష్ణానగర్ ఒకటో వీధిలోని గోదాపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి 20వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల ఐదు నుంచి తొమ్మిది వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ధనకుదరం శ్రీనివాసాచార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.



ర్యాలీలో తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు, నేతలు



ర్యాలీలో తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్, నాయకులు



ర్యాలీలో పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ తదితరులు

వెన్నుపోటుపై ఆగ్రహ జ్వాల

- సర్కార్ తీరును ఎండగడుతూ నిరసన ర్యాలీలు చేపట్టిన వైఎస్సార్‌సీపీ
- నియోజకవర్గ కేంద్రాలలో పెద్ద ఎత్తున హాజరైన ప్రజలు, పార్టీ శ్రేణులు
- అడుగడుగునా ఆంక్షల పేరిట అడ్డంకులు సృష్టించిన పోలీసులు
- జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబుతో సీఐ ఓవరాక్షన్
- వేలు చూపిస్తూ మరీ బెదిరింపులు
- గుంటూరు నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా హౌస్ అరెస్ట్‌కు ప్రయత్నం
- తాడికొండలో ఫ్లెక్సీలను బలవంతంగా తొలగించిన పోలీసులు



గుంటూరులో వెన్నుపోటు దినం ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో జిల్లా అధ్యక్షుడు అంబటి



గుంటూరులో నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి హాజరైన జనసందోహం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: కూటమి ఏడాది పాలనపై ప్రజాగ్రహం పెల్లుబికింది. మాయమాటల కూటమి ప్రభుత్వం తీరును ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. ప్రజలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు.

మాజీ మంత్రిని కూడా లెక్కచేయకుండా..

కార్యక్రమంలో పాల్గొనేందుకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు బుధవారం గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు సిద్ధార్థనగర్‌లోని ఆయన నివాసం నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో కొంత మంది యువకులు, పార్టీ నేతలు స్వచ్ఛందంగా బైకులు వేసుకుని అంబటి వెంట వచ్చారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల వద్దకు చేరుకునే సరికి పట్టాభిపురం పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వో గంగా వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి అంబటి రాంబాబు వస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. ర్యాలీకి అనుమతి లేదంటూ.. అంబటి, పార్టీ నేతలపై దురుసుగా వ్యవహరించారు. అప్పటికీ తామేమీ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించటం లేదని, కలెక్టరేట్ ఎక్కువ దూరం కూడా లేదని అంబటి చెబుతున్నా ససేమిరా అన్నారు. ఇష్టానుసారంగా వ్యవహరించారు. మాజీ మంత్రి అని కూడా చూడకుండా అంబటికి వేలు చూపిస్తూ.. ఎస్‌హెచ్‌వో గంగా వెంకటేశ్వర్లు ఓవర్‌యాక్షన్ ప్రదర్శించారు. రెడ్‌బుక్ పాలనకు దాసోహమై నోటికి వచ్చినట్లు మాట్లాడారు. ఆ క్రమంలో అంబటి కూడా ఘాటుగానే స్పందించారు. ఖాకీ దుస్తులు వేసుకుని ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. అయినప్పటికీ వాహనాలను నిలువరించటంతో పార్టీ నేతలు అక్కడ నుంచి నడుచుకుంటూ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు.

హౌస్ అరెస్టుకు యత్నం

పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమాను హౌస్ అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నాలు చేశారు. ఆమె అందుబాటులో లేకపోవటంతో బుధవారం ఉదయం 6.30 గంటలకే ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కార్యాలయం వద్దకు ఇద్దరు ఎస్సైలు, 20 మంది వరకు కానిస్టేబుళ్లు చేరుకున్నారు. పార్టీ నేతలను నూరి ఫాతిమా ఎక్కడ? అని అడుగుతూ హడావుడి చేశారని సమాచారం. ఉదయం 9.30 గంటల వరకు కార్యకర్తలు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్దకు వస్తుండగా అడ్డుకునే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. పోలీసులు నిలువరిస్తున్నా ఏ మాత్రం ఖాతరు చేయకుండా 'వెన్నుపోటు దినం' కార్యక్రమం చేపట్టిన ప్రాంతానికి చేరుకున్నారు.

ఫ్లెక్సీలు కట్టినా తప్పేనా?

తాడికొండ నియోజకవర్గంలో 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమంలో సభ వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కూడా పోలీసులు వదల్లేదు. అనుమతులు లేవని సీఐ వాసు పేర్కొంటూ.. ఆ ఫ్లెక్సీలను తొలగించే పనులు చేపట్టారు. దీంతో పోలీసులకు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబుకు మధ్య వాగ్వాదం జరిగింది. బాల వజ్రబాబు మాట్లాడుతూ ఎవరికీ ఇబ్బంది లేని ఫ్లెక్సీలను తొలగించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు.

ప్రజల పక్షాన పోరాటానికి సిద్ధం



ఈ సందర్భంగా మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు మాట్లాడుతూ.. ఏడాది పాలనలో ఏమైనా పథకాలు అమలు చేశారా అని నిలదీశారు. ఇంటి దగ్గర పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడం గర్హనీయం అన్నారు. ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమన్నారు. వెన్నుపోటు అనే పదానికి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని వ్యాఖ్యానించారు. నాణ్యమైన మద్యాన్ని అందిస్తామని చెప్పిన ఏకైక సీఎం చంద్రబాబు అని వ్యాఖ్యానించారు. చంద్రబాబుకు ఓటు వేసి మోసపోయామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కచ్చితంగా ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, ప్రజల పక్షాన పోరాటంపై వెనక్కి తగ్గబోమన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమేనా?



వైఎస్సార్‌సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు పోతిన మహేష్ మాట్లాడుతూ... చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు అభివృద్ధి, సంక్షేమంపై బహిరంగ చర్చకు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. ఎక్కడైనా దీనిపై మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఏ కుటుంబాన్ని చూసినా.. కన్నీటి గాథేనని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. కాపు ఉద్యమానికి సంబంధించి కేసును తిరిగి విచారించేందుకు యత్నాలు చేయటం సిగ్గుచేటన్నారు. దీనిపై పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలన్నారు. ప్రజల కోసం ఎంతటి పోరాటానికైనా వెనుకాడబోమని తెలిపారు.

ఓటేసిన అన్నివర్గాలకు పోటు



కార్యక్రమంలో ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో కూటమి సర్కార్ పూర్తిగా విఫలం అయిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయకుండా, ప్రజలను నిలువునా వంచించారని తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి అక్రమ కేసులు పెట్టడం, ప్రతిపక్ష కార్యకర్తలు, ప్రజలను ఇబ్బందులు పెట్టేలా దుర్మార్గ పాలన సాగుతోందన్నారు. పథకాల సంగతి పక్కనబెట్టి.. కేవలం స్కాంలతో కూటమి పాలకులు ముందుకు సాగుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిపోతోందని చెప్పారు.

మహిళలను మోసగించిన బాబు



వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ... నయవంచనకు నిలువెత్తు రూపం చంద్రబాబు అని మండిపడ్డారు. మహిళలను అన్ని విధాలుగా మోసం చేసి, సిగ్గు లేకుండా రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకుపోతోందని చెప్పటం దుర్మార్గమన్నారు. ప్రజలు ఇప్పటికే కూటమి సర్కార్‌ను అసహ్యించుకుంటున్నారని చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా.. అని ఎదురు చూస్తున్నారన్నారు. అక్రమ కేసులు, ఉడత బెదిరింపులకు తాము ఏ మాత్రం భయపడేది లేదని చెప్పారు. ప్రజల పక్షాన ఉద్యమం అయినా కొనసాగిస్తామని, చంద్రబాబు పాలన నుంచి విముక్తి కలిగేలా పోరాడతామన్నారు.

నిరసన కార్యక్రమం విజయవంతం

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమాల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన 'వెన్నుపోటు దినం' కార్యక్రమానికి ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, పార్టీ గుంటూరు పార్లమెంటరీ జిల్లా పరిశీలకుడు పోతిన మహేష్ హాజరయ్యారు. ఈ నిరసన కార్యక్రమం విజయవంతం అయింది.

ప్రత్తిపాడులో..



ప్రత్తిపాడులో నిర్వహించిన ర్యాలీలో నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు

ప్రత్తిపాడులో నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఇందిరాగాంధీ బొమ్మ సెంటరు నుంచి అంకమ్మ గుడి సెంటరు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోనికి వచ్చిన సంవత్సరంలో సూపర్‌సిక్స్ హామీల్లో ఏ ఒక్కటైనా అమలు చేశారా? అని పాలకులను ప్రశ్నించారు.

మంగళగిరిలో..

మంగళగిరిలో నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని డిప్యూటీ తహసీల్దార్ అంకారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు రాజకీయ జీవితం ఎన్టీఆర్‌కు వెన్నుపోటుతోనే ప్రారంభమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రజలే తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.



ర్యాలీలో పాల్గొన్న మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ హనుమంతరావు, నాయకులు, కార్యకర్తలు

తెనాలిలో..

తెనాలిలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక మున్సిపల్ మార్కెట్ సెంటర్ నుంచి మెయిన్‌రోడ్డు, గాంధీచౌక్, బోసు రోడ్, టౌన్‌చరి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయానికి ప్రదర్శన చేరుకుంది. ఈ సందర్భంగా అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ అయిన నాదెండ్ల భాస్కరరావు కుమారుడు మనోహర్ ప్రస్తుతం ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నారని గుర్తుచేశారు. వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్ అయిన కూటమి నేతలు... తమ మాటల్ని నమ్మి ఓటు వేసిన ప్రజలను కూడా వెన్నుపోటు పొడిచి చరిత్రను పునరావృతం చేశారన్నారు. ఇచ్చిన మాట నిలుపుకోలేని కూటమి ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

తాడికొండలో..

తాడికొండలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమంలో వేలాది మంది నాయకులు, కార్యకర్తలు, పార్టీ పలు విభాగాల అధ్యక్షులు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, బూత్ కన్వీనర్లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనమా బాలవజ్రబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో హామీలు గుప్పించి ఇప్పుడు డబ్బులు లేవని చంద్రబాబు నిస్సిగ్గుగా పేర్కొనడం తగదన్నారు. సంపద సృష్టించి అందరికీ పంచుతానని చెప్పిన ఆయన.. అలా సంపద సృష్టించే ఐడియాలు ఏమైనా ఉంటే తనకు చెవిలో చెప్పాలని అవహేళనగా మాట్లాడటం ఆయనకే చెల్లిందన్నారు. అన్నివర్గాలకు ఇచ్చిన హామీల మేరకు వెంటనే సంక్షేమ పథకాలు అందించాలన్నారు.

పొన్నూరులో..

పొన్నూరులో వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులతోపాటు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి సూపరింటెండెంట్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు సూపర్ సిక్స్‌తోపాటు పలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. కానీ ఇప్పుడు వాటిని అమలు చేయడం లేదన్నారు. ప్రజలను వంచించి వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్‌గా సీఎం చంద్రబాబు నిలిచారని పేర్కొన్నారు. వెంటనే పథకాలు అమలు చేసి ఇచ్చిన మాట నిలుపుకోవాలన్నారు. లేకుంటే వారే సమయం వచ్చినప్పుడు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **1,400** గరిష్ఠం : రూ. **2,000**

మోడల్ ధర రూ. **1,700**



పసుపు ధరలు

(బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : **355**

కొమ్ములు : **207** బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,700	10,300	10,250

కాయలు : **128** బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,700	10,350	10,250

మొత్తం అమ్మకాలు : **251.250** క్వింటాళ్లు

–దుగ్గిరాల

క్లుప్తంగా

నేడు పదోన్నతుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

నగరంపాలెం: ఉమ్మడి జిల్లాలోని మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో విధులు నిర్వర్తించే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతుల కౌన్సెలింగ్‌కు అర్హత ఉన్న వారి జాబితా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారిణి సి.వి.రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టు, మీడియంలో మున్సిపల్ కార్పొరేషన్‌లో 162 పోస్టులు, మున్సిపాలిటీలో 40 పోస్టులు, పదోన్నతులకు అర్హత ఉన్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఈ నెల 5న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వ యాజమాన్యంలో 50 పోస్టులు, జిల్లా పరిషత్ యాజమాన్యంలో 83 పోస్టుల పదోన్నతులకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గుంటూరు పాత బస్టాండ్‌లోని ప్రభుత్వ బాలుర పాఠశాలలోని పరీక్షా భవన్‌లో ఉంటుందని వెల్లడించారు.





వెన్నుపోటుపై వెల్లువెత్తిన నిరసన

పట్నంబజారు: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమాల సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 'వెన్నుపోటు దినం' కార్యక్రమం బుధవారం జరిగింది. ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, పార్టీ గుంటూరు పార్లమెంటరీ జిల్లా పరిశీలకుడు పోతిన మహేష్ హాజరయ్యారు. కార్యక్రమంలో నేతలు నిమ్మకాయల రాజనారాయణ, ఈమని రాఘవరెడ్డి, కొత్తా చిన్నపరెడ్డి, నందేటి రాజేష్, సీడీ భగవాన్, కొరిటిపాటి ప్రేమ్‌కుమార్, వాసిమళ్ళ విజయ్, మామిడి రాము, పార్టీ నేతలు, కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారికి నాయకులు వినతిపత్రం అందించారు.

కరోనా కలకలం...

బదిలీల కలవరం

- వైద్య ఉద్యోగుల్లో ఆందోళన
- ఐదేళ్లు దాటితే స్థాన చలనం
- యూనియన్‌లకు ప్రాధాన్యత అంతంతే



గుంటూరు మెడికల్: జిల్లాలో ఒక పక్క కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. మరోపక్క గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది కరోనా సోకి ఇబ్బంది పడుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులను కూడా ఈ పరిణామాలు కలవరపెడుతున్నాయి. గతంలో అనేక మంది వైద్య ఉద్యోగులు కరోనా బారిన పడి చికిత్స పొందారు. కొంత మంది ప్రాణాలు కోల్పోయారు. మరోసారి కరోనా కేసులు రావడం ఉద్యోగుల్లో ఆందోళనకు దారి తీసింది. మరోపక్క వైద్య ఉద్యోగుల బదిలీలను ప్రభుత్వం చేపట్టింది. ఈ నెల 19వ తేదీలోపు ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేయనున్నారు.

ఐదేళ్ల సర్వీసు పూర్తయితే బదిలీ

ఒకే చోట ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వైద్యులు, వైద్య సిబ్బందికి తప్పనిసరిగా స్థానచలనం కలిగించనున్నారు. గతంలో దీర్ఘకాలం ఉన్న సిబ్బందిలో 20 శాతం మందిని మాత్రమే బదిలీ చేసేవారు. దీంతో అందరూ ఇబ్బంది పడేవారు కాదు. ఇప్పుడు ఐదేళ్ల సర్వీసు, కొన్ని కేడర్‌లలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరిని బదిలీ చేయాలని నిబంధన పెట్టారు. దీంతో బదిలీల కలవరం ప్రారంభమైంది.

ప్రాక్టీస్ వదిలి వెళ్లలేక..

దీర్ఘకాలికంగా ఒకేచోట పనిచేయడం వల్ల గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాల, జిల్లాలోని పలు ఆసుపత్రుల వైద్యులు ఎక్కువ శాతం మంది సొంత క్లీనిక్‌లు పెట్టుకున్నారు. గుంటూరులోనే ప్రాక్టీస్ చేస్తున్నారు. జిల్లాలో మరికొన్ని ప్రాంతాల్లో వైద్యులు ఆసుపత్రులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం తప్పనిసరి బదిలీ నిబంధనతో ప్రాక్టీస్ వదిలి వెళ్లేందుకు పలువురు సంశయిస్తున్నారు. వైద్య సిబ్బంది సైతం గుంటూరు చుట్టుపక్కల పిల్లలను చదివించుకుంటూ, గృహాలు నిర్మించుకుని ఇక్కడే స్థిరపడ్డారు. విద్య, వైద్య రంగంలో ఎప్పటి నుంచో గుంటూరు జిల్లాకు పేరుండటంతో అనేక మంది స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. బదిలీల పేరుతో ప్రభుత్వం వేరేచోటకు పంపించేందుకు సిద్ధమడంతో వారు ఆందోళన పడుతున్నారు.

జూనియర్ అసిస్టెంట్ల ఆందోళన

జీజీహెచ్‌లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లు పదోన్నతులు వదులుకొని సుమారు 20 –30 సంవత్సరాలుగా ఇక్కడే పనిచేస్తున్నారు. ప్రమోషన్ తీసుకుంటే ఇతర జిల్లాలకు బదిలీ చేస్తారన్న భయంతో ఇలా చేశారు. అందులోనూ గుంటూరు జీజీహెచ్‌లోనే జీవితాంతం పనిచేసేందుకు అన్ని బెనిఫిట్స్ వదులుకుని పలువురు జూనియర్ అసిస్టెంట్లు విధులు నిర్వహిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా వారిని సైతం బదిలీ చేస్తారంటూ ఊహాగానాలు వచ్చాయి. దీంతో జీజీహెచ్ మినిస్టీరియల్ ఉద్యోగులంతా సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. రాష్ట్రపతి అనుమతి లేకుండా గుంటూరు జీజీహెచ్ యూనిట్ సిబ్బందిని బదిలీ చేసే అధికారం ఎవరికీ లేదనే విషయాలను బయటపెట్టారు. సదరు విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి సైతం పంపించారు. దీంతో ఈ ఏడాదికి జూనియర్ అసిస్టెంట్‌లకు బదిలీలు లేనట్లేనని వార్తలు వినిపిస్తున్నాయి.

యూనియన్‌లకు ఆంక్షలు

గతంలో యూనియన్ పేరుతో ఉద్యోగులు దీర్ఘకాలికంగా ఒకే ప్రాంతంలో ఉండేవారు. నేడు ఒకేచోట లేకుండా పలు మార్గదర్శకాలను సంఘ నాయకులకు ప్రభుత్వం విడుదల చేసింది. యూనియన్‌లో చేరిన సభ్యత్వాల రశీదులు, ఎన్నికల్లో పాల్గొన్నట్లు జాబితా, యూనియన్ కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు వివరాలు సమర్పించాలని పేర్కొంది. దీంతో నేతలకు సైతం స్థానచలనం తప్పడం లేదు. నగరంలో ఒక చోట నుంచి మరోచోటికి యూనియన్ నేతలు బదిలీ కోరుకునేలా కొంత మినహాయింపు ఇచ్చారు.

20 రోజుల ప్రక్రియ

వైద్య ఆరోగ్య శాఖలో బదిలీ ప్రక్రియ 20 రోజులపాటు జరుగనుంది. మే 31 నుంచి జూన్ 19వ తేదీ వరకు నిర్వహిస్తారు. జూన్ 17 – 19 వరకు కౌన్సెలింగ్ ఉంటుంది. తర్వాత బదిలీ ఉత్తర్వులు అందజేస్తారు. ఒకేచోట రెండేళ్లకుపైగా పనిచేస్తున్న వారు రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులకు, ఉద్యోగులైన భార్యభర్తలకు నిబంధనల ప్రకారం బదిలీలు నిర్వహిస్తారు. గురు, శుక్రవారాల్లో అభ్యర్థులు బదిలీ ఆప్షన్లు ఎంచుకునేందుకు గడువు ఇచ్చారు. గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయం, గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు ప్రాంతీయ వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయాల్లో ఉద్యోగులు, అధికారులు కొద్దిరోజులుగా బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నారు.

ప్రతి ఇల్లు యోగా కేంద్రం కావాలి

ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: ప్రతి ఇల్లు యోగా కేంద్రంగా మారితే ఆ ఇంట ఆరోగ్య, మానసిక సమస్యలు చాలా వరకు తగ్గిపోతాయని ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. బుధవారం యోగాంధ్రాలో భాగంగా స్థానిక బృందావన్‌గార్డెన్స్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన తోపాటు నగర మేయర్ కోవెలమూడి రవీంద్రనాథ్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, డీఆర్వో షేక్ ఖాజావలి, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, డెప్యూటీ మేయర్ షేక్ షజిల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొన్ని రోజులుగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శారీరక, మానసిక ప్రయోజనాలు కలిగించే యోగాపై ప్రజలు విస్తృతంగా అవగాహన పెంచుకోవాలన్నారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ ప్రతి వ్యక్తి జీవితంలో యోగ ఒక భాగం కావాలన్నారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు యోగాసనాలు వేశారు.



యోగాసనాలు వేస్తున్న ఎ.భార్గవ్‌తేజ, ఎమ్మెల్యే మాధవి, అధికారులు

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

అత్యుత్తమ నగరంగా అమరావతి నిర్మాణం

ఫిరంగిపురం: ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా అమరావతిని నిర్మించనున్నట్లు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో వనమహోత్సవం కార్యక్రమానికి గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రానున్నారు. దానికి సంబంధించి ఏర్పాట్లను బుధవారం రాత్రి నారాయణ పరిశీలించారు. ముఖ్యమంత్రి మొక్కలు నాటే ప్రాంతాన్ని పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వనమహోత్సవం సందర్భంగా ఐదు కోట్ల మొక్కలు నాటుతామన్నారు. రాజధాని ప్రాంతాన్ని అత్యున్నత నిర్మాణాలతోపాటు గ్రీన్ అండ్ బ్లూ నగరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిపారు. పచ్చదనం కోసం ఒకే రకం మొక్కలు కాకుండా సింగపూర్, జపాన్‌తో సంప్రదించి అక్కడి మాదిరిగా ప్లాంటేషన్ ఉండేలా చూడమని చంద్రబాబు సూచించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ రాజధాని ప్రాంతాన్ని ఆహ్లాదకరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ ఎండీ లక్ష్మీపార్థసారథి, ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ సుజాత, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం(తాడికొండ): తుళ్లూరు మండలం అనంతవరం గ్రామంలో గురువారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించే వన మహోత్సవానికి ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పర్యటన ఏర్పాట్లను ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, రాష్ట్ర ఏపీఎంఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, ఆర్డీవో శ్రీనివాసరావులు పరిశీలించారు. సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎ.భార్గవ్ తేజ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అధికారులు చేపట్టాల్సిన వివిధ పనులపై తగిన సూచనలు అందజేశారు. శానిటేషన్, పార్కింగ్, బ్యారికేడ్ పనులు సజావుగా చేపట్టాలని చెప్పారు. నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. వారి వెంట ఫారెస్ట్ కన్జర్వేటర్ రాజు, అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) రవి కుమార్, డీఎస్పీ మురళీకృష్ణ, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ఎండీ నజీమా బేగం, ఏపీఎంఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బసవేశ్వరరావు, తుళ్లూరు సీఐ శ్రీనివాసరావు, తహసీల్దార్లు సుజాత, వెంకటేశ్వర్లు, పలు శాఖల అధికారులు ఉన్నారు.



పరిశీలిస్తున్న మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌లు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, ఎస్పీ సతీష్‌కుమార్

యోగాతో మానసిక ఉల్లాసం

పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

విజయపురి సౌత్: యోగాతో ఒత్తిడి దూరమై మానసిక ఉల్లాసం కలుగుతుందని పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం పల్నాడు జిల్లా మాచర్ల మండలంలో ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన అనుపు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ప్రసిద్ధ పర్యాటక కేంద్రంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సుమారు 2000 మంది పాల్గొన్నారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి మురళి మాట్లాడుతూ.. ఈ నెల 21వ తేదీన కార్యక్రమం భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా మాచర్ల పట్టణానికి చెందిన మెట్టు గోవిందరెడ్డి దాదాపు 200 యోగా మ్యాట్స్‌ను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. బెలూన్లను గాలిలోకి వదిలారు. నాగార్జునకొండ క్యూరేటర్ కమల్ హాసన్, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ ప్రసన్న లక్ష్మి, పర్యాటకశాఖ డివిజనల్ మేనేజర్ చైతన్య, ఆర్డీవో మురళీకృష్ణ, జిల్లా మెడికల్ ఆఫీసర్ డా.రవి, ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణ మోహన్, ఈఈ రమేష్ ,ఆర్ అండ్‌బీ ఎస్ఈ రాజా నాయక్, డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి, ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి, డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీ రాణి, ట్రాన్స్‌పోర్ట్ అధికారి సంజీవ్ కుమార్, డీఎఫ్ఓ ఫైర్ శ్రీధర్‌రావు, డీఎల్‌డీవో గబ్రు నాయక్, హౌసింగ్ ఈఈ రవీంద్ర, డీపీఓ నాగేశ్వర నాయక్ , జిల్లా పర్యాటక శాఖ అధికారి నాయుడమ్మ , జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు, డీసీఓ వెంకటరమణ, ఏపీఎంఐపీ అంజనేయులు, ఏపీటీడీసీ డిప్యూటీ మేనేజర్ శివారెడ్డి, గ్రౌండ్ వాటర్ అధికారి శ్రీనివాసరావు, మాచర్ల మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, మాచర్ల తహసీల్దార్ కిరణ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.



అనుపులో కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, అధికారులు, ఉద్యోగులు

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

అచ్చంపేట: ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయిన బాలుడిని సామాజికవేత్త షేక్ కమల్‌సైదా బుధవారం తల్లిదండ్రులకు అప్పగించారు. అచ్చంపేట ఎస్సీ కాలనీకి చెందిన సండెపోగు వివేక్ గత 29న గుంటూరు వెళ్లి రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కి మహారాష్ట్రలోని జనగావ్ జిల్లా స్టేషన్ పోలీసులకు చిక్కినట్లుగా కమల్ సైదా సమాచారం తెలుసుకున్నారు. మహారాష్ట్రలోని పోలీస్ వారితో మాట్లాడి వివేక్ పల్నాడు జిల్లా అచ్చంపేట గ్రామానికి చెందినవాడిగా సమాచారం అందించారు. తిరిగి అచ్చంపేటకు రప్పించారు. గత వారం రోజులుగా కుమారుడి కోసం వెతుకుతున్న తల్లిదండ్రులకు అతడిని అప్పగించడంతో ఆనందపడ్డారు. కార్యక్రమంలో మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బీరువాల సైదా తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

జి.కొండూరు: బైకుపై వెళ్తూ గేదెను ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గుంటూరు జిల్లా తాడికొండ మండలం దామరపల్లికి చెందిన వీసా రాజేష్(26) గత కొన్నేళ్లుగా తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ క్యాటరింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం తల్లిదండ్రులను చూసేందుకు సొంత గ్రామానికి వెళ్లిన రాజేష్, తిరుగు ప్రయాణంలో మైలవరం వైపు వస్తున్న క్రమంలో రాత్రి 8 గంటల సమయంలో జి.కొండూరు శివారులోకి రాగానే జాతీయ రహదారిపై గేదెను ఢీకొని కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన రాజేష్‌ని జి.కొండూరు పోలీసులు 108 అంబులెన్స్‌లో విజయవాడలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజేష్ బుధవారం ఉదయం మృతి చెందాడు.

చీకట్లో గేదె కనిపించక...

రహదారిపై గేదెను భారీ వాహనం ఢీకొట్టడంతో గేదె మృతి చెంది రోడ్డుపై పడి ఉంది. అదే సమయంలో అటుగా బైకుపై వస్తున్న రాజేష్‌కు రోడ్డుపై మృతి చెందిన గేదె చీకట్లో కనిపించక ఢీకొట్టి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి తండ్రి వీసా భాస్కరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో నగలు, నగదు చోరీ

బెల్లంకొండ: తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన దొంగలు నగలు, నగదు చోరీ చేసిన ఘటన మండలంలోని నాగిరెడ్డి పాలెం గ్రామంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్సై డి.ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఎర్రబ్రద్దూరి చిన రమణారెడ్డి కుటుంబ సభ్యులతోపాటు గ్రామంలోని మరి కొంతమందితో కలిసి సోమవారం శ్రీశైలం దైవ దర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో రమణారెడ్డి ఇంట్లోకి దొంగలు కిటికీ గుండా చొరబడ్డారు. బీరువా పగలు కొట్టి 23.5 సవర్ల బంగారం, 15 వేల నగదు చోరీ చేశారు. మంగళవారం ఉదయం ఇరుగు పొరుగువారు ఇంటి పరిసర ప్రాంతాల్లో వస్తువులు చెల్లాచెదురుగా ఉండడాన్ని గమనించారు. వెంటనే విషయాన్ని రమణారెడ్డి బంధువులతో చెప్పగా వారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు వచ్చి పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ద్వారా ఆధారాలు సేకరిస్తున్నట్లు పెదకూరపాడు సీఐ సురేష్ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కారంచేడు: వ్యాపార నిమిత్తం చీరాలకు తన ద్విచక్ర వాహనంపై వెళుతున్న కూరగాయల వ్యాపారి ప్రమాదంలో మరణించాడు. కారంచేడు ఎస్ఐ వి. వెంకట్రావు తెలిపిన వివరాల మేరకు.. పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన వేమా శివయ్య (57) తన ద్విచక్ర వాహనంపై కూరగాయలు, ఆకు కూరలు ఊరూరు తిరిగి అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ప్రతి రోజూ ఆయన నూతలపాడు నుంచి చీరాలకు ద్విచక్ర వాహనంపై వచ్చి మార్కెట్‌లో కూరగాయలు, ఆకుకూరలు కొనుగోలు చేసుకొని తిరిగి వెళ్ళి అక్కడ అమ్ముకుంటూ ఉంటాడు. ఈ క్రమంలో బుధవారం కూడా ఆయన చీరాలకు బయలు దేరాడు. వాడరేవు–పిడుగురాళ్ళ ప్రధాన రహదారిలో కారంచేడు–చీరాల మార్గంలో హోలి చర్చ్ సమీపంలో ఎదురుగా వస్తున్న గేదెలను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు 108కు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. బంధువులు వచ్చి చీరాల ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి మృతి చెందాడని తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.